

రథోత్సవానికి సర్వం సిద్ధం
నేడు నేత్రోత్సవం, సుభద్రా కల్యాణం
రేపు జగన్నాథ స్వామి రథోత్సవం - వార్త I పేజీలో



డ్రైనేజీల్లోనే మంచినీటి పైప్‌లైన్లు

పొంచి ఉన్న డయేరియా ముప్పు

రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదవుతున్నా స్పందించని జీవీఎంసీ



వన్‌టౌన్ చింకపేటలో మురికికాల్వలో పైప్‌లైన్

- సమావేశాలతోనే కాలక్షేపం
- మురుగు నీటి కాల్వల్లో ఉన్న పైప్‌లైన్ల మార్పుపై దృష్టిపెట్టని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎక్కడికక్కడ డయేరియా కేసులు వెలుగు చూస్తున్నాయి. నీటి కాలుష్యం కారణంగా గుంటూరుతోపాటు విజయవాడ, కాకినాడ వంటి ప్రాంతాల్లో అతిసార కేసులు నమోదవుతున్నాయి. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో జీవీఎంసీ అధికారులు కొద్దిరోజులుగా డయేరియా నివారణపై హడావిడి చేస్తున్నారు. అయితే కేవలం సమావేశాలు, అవగాహన కార్యక్రమాలతోనే సరిపెట్టేస్తున్నారు తప్పితే డ్రైనేజీల్లోఉన్న నీటి సరఫరా పైప్‌లైన్‌లను మార్చే ప్రయత్నం చేయడం లేదు.

వర్షాకాలం ప్రారంభం కావడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. అటువంటి ఇబ్బంది రాకుండా మే, జూన్ నెలల్లోనే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే తాగునీటి పైప్‌లైన్లలో మురుగునీరు కలిసే ఆస్కారం ఉంది. ఈ విధంగానే గుంటూరులో కలుషిత నీరు కారణంగా డయేరియా ప్రబలింది. దీనివల్ల అక్కడ ముగ్గురు మృతిచెందారు. నెల రోజుల కిందట కలుషిత నీరు కారణంగానే విజయవాడలోని పలుప్రాంతాల్లో డయేరియా విజృంభించింది. ఐదురుగు మృత్యువాతపడగా వందలాది మంది ఆస్పత్రి పాలయ్యారు. తాజాగా చిత్తూరు జిల్లాలో నాలుగు, తూర్పు గోదావరి జిల్లాలో రెండు, కాకినాడలో రెండు కేసులు చొప్పున కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై డయేరియా నియంత్రణకు కార్యాచరణ రూపొందించింది. అన్ని స్థానిక సంస్థలకు మార్గదర్శకాలు జారీచేసింది. డయేరియా ప్రబలకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజల్లో చైతన్యం పెంచాలని ఆదేశించింది. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు అప్రమత్తమై డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోన్‌ల వారీగా సమావేశాలు

... మిగతా 6వ పేజీలో



ఒలింపిక్స్‌కు ఎర్రాజీ జ్యోతి

నగరం నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా రికార్డు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 5:

నగరానికి చెందిన అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొననున్నది. విశాఖ నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. వచ్చే నెల 26 నుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. వరల్డ్ అథ్లెటిక్స్ సమాఖ్య విడుదల చేసిన ఆటోమేటిక్ క్వాలిఫికేషన్, కటాఫ్ ర్యాంకింగ్స్‌లో 34వ స్థానంలో నిలిచిన జ్యోతి ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్నది. భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పదకొండు (11) మంది అథ్లెట్లలో ఎర్రాజీ జ్యోతి ఒకరు కావడం విశేషం.

100 మీటర్ల హర్డిల్స్‌లో...

ట్యాక్సీ డ్రైవర్ కూతురైన జ్యోతి సాధారణ అథ్లెట్‌గా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టి...క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి దేశం గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో తన

... మిగతా 6వ పేజీలో

నాడు-నేడు పనులపై దృష్టి

అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయాలని నిర్ణయం

త్వరలోనే తగిన ఆదేశాలు ఇస్తామన్న మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్



చంద్రంపాలెం పాఠశాలలో అసంపూర్తిగా పనులు

- రూ.16 కోట్లు అవసరమని అధికారుల అంచనా
- పాఠశాల విద్యాశాఖకు అధికారులు ప్రతిపాదన
- పథకం పేరు 'పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపు'గా మార్పు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని పూర్తిచేయాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ ఇటీవల పాఠశాల విద్యాశాఖపై సమీక్షించినప్పుడు పెండింగ్ పనులు పూర్తికి రెండు, మూడు వారాల్లో ఆదేశాలు ఇస్తామని వెల్లడించారు.

గత ప్రభుత్వం పాఠశాలల్లో వసతుల కల్పనకు 2020లో నాడు-నేడు పథకం ప్రారంభించింది. అయితే పలు కారణాల వల్ల మొదటి దశ పనులు పూర్తికి రెండేళ్లు పట్టింది. రెండో దశ పనులు 2022లో ప్రారంభించిన ప్రభుత్వం...సకాలంలో నిధులు విడుదల చేయలేకపోయింది. దీంతో పనులు ముందుకుసాగలేదు. కొన్ని పాఠశాలల్లో పనులు మధ్యలో నిలిచిపోగా, మరికొన్నిచోట్ల చేపట్టిన పనులకు నిధులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. విశాఖ జిల్లాలో 'నాడు-నేడు' రెండో విడత కింద 309 పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.114.48 కోట్లతో పనులు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంట్లో 500కుపైగా అదనపు గదులు, ఇంకా ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, గ్రీన్‌చాక్ బోర్డుల ఏర్పాట్లు, తదితర పనులు ఉన్నాయి. అయితే పథకం ప్రారంభంలో కొంత మొత్తం నిధులు విడుదల చేయడంతోపాటు సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేశారు. ఆ తరువాత నిధులు విడుదల విషయం పట్టించుకోలేదు సరికదా సిమెంట్ కూడా ఇవ్వలేదు. పోనీ బయట కొనుగోలు చేద్దామంటే ఉన్నతాధికారులు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో పనులకు తీవ్ర

... మిగతా 6వ పేజీలో

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

ప్రతి వినియోగదారుడూ తీసుకోవచ్చు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- గ్రామాలకూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా
- రూ.1,600 కోట్లతో ఫీడర్ల ఏర్పాటు
- గత ఏడాదిలో 13 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం
- గిరిజన గ్రామాల్లో 35 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరాకు రూ.150 కోట్ల వ్యయం
- 8 లక్షల స్మార్ట్ మీటర్ల బిగింపునకు చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో ప్రతి గ్రామానికి 24/7 విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గతంలో రూఫ్‌టాప్ సోలార్ పథకం కింద కిలోవాట్‌కు రూ.16 వేలు రాయితీ ఇచ్చేవారని, ఇప్పుడు దానిని మొదటి మూడు కిలోవాట్లకు రూ.78 వేలకు పెంచారన్నారు. దీనిని ప్రతి విద్యుత్ వినియోగదారుడు తీసుకోవచ్చునని, సంబంధించిన యాప్‌లో సర్వీసు నంబరుతో రిజిస్టర్ కావలసి ఉంటుందన్నారు. ఇప్పుడు పది కిలోవాట్ల వరకు ఎటువంటి ఫీజుబులిటీ రిపోర్ట్ అవసరం లేకుండానే పథకం వర్తింపజేస్తారని, బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయని, డౌన్ పేమెంట్ కింద కేవలం రూ.10 వేలు భరించగలిగితే రూఫ్‌టాప్ సోలార్ పొందవచ్చునన్నారు. విశాఖపట్నం నగరంలో మిగిలిన ప్రాంతాల్లోను అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

13 వేల వ్యవసాయ కనెక్షన్లు

గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో 13 వేల మంది రైతులకు ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఎన్నికల సమయంలో కోడ్ అమలులో ఉండడం వల్ల 2,400 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా మంజూరుచేస్తామని చెప్పారు. వ్యవసాయానికి 9 గంటలు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా 900 ఫీడర్లు ఏర్పాటుచేస్తున్నామని సీఎండీ వివరించారు. ఇప్పుడు గ్రామాలకు కూడా త్రీ ఫేజ్ విద్యుత్ ఇవ్వడానికి ఫీడర్లు మారుస్తున్నామని, ఓవర్‌లోడ్ ఫీడర్లు కూడా గుర్తించి కొత్తవి వేస్తామని, వీటికి కేంద్ర పథకమైన ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రూ.1,600 కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు.

రూ.150 కోట్లతో ఏజెన్సీలకు విద్యుత్ వెలుగులు

రూ.150 కోట్లతో గిరిజన గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నింపాలని శ్రీకాకుళం జిల్లా సీతంపేట నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ పురం వరకు 35 వేల ఇళ్లను గుర్తించామన్నారు. వాటిలో 32 వేల ఇళ్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు కూడా పెట్టామన్నారు. ఇవన్నీ

... మిగతా 6వ పేజీలో



విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో 'బుజ్జి'

బుజ్జి సందడి

- నగరంలో 'కల్కి' కారు
- నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు

ప్రభాస్ పాన్ ఇండియా సినిమా 'కల్కి'లో ఉపయోగించిన కారు 'బుజ్జి' విశాఖపట్నంలో సందడి చేస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా దానిని రాష్ట్రం అంతటా తిప్పుతున్నారు. శుక్రవారం ఉదయం నగరానికి తీసుకువచ్చి విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో ఉంచారు. అక్కడి విద్యార్థులకు దానిని ప్రదర్శించారు. శని, ఆదివారాల్లో మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ప్రదర్శిస్తారని సమాచారం. ఈ కారు పేరు 'బుజ్జి'. దీనికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ ప్రత్యేకంగా తయారుచేసింది. నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. అంటే వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ అవుతుంది. బుజ్జి బరువు ఆరు టన్నులు. దీనిని ప్రత్యేకమైన ట్రక్కులో రాష్ట్రమంతటా తిప్పుతున్నారు. ప్రదర్శన ఉన్నచోట కిందికి దించి, శిక్షణ పొందిన నిపుణుల ద్వారా డ్రైవ్ చేయిస్తున్నారు. ఈ కారుకు మూడు టైర్లు ఉన్నాయి. ముందు రెండు, వెనుక ఒకటి. ఇవి హబ్ లెస్ టైర్లు. సియట్ కంపెనీ వీటిని ప్రత్యేకంగా రూపొందించింది. డ్రైవర్‌కు స్పెషల్ సీటింగ్ ఉంది. పైన గ్లాస్ డోమ్. కారు పొడవు 6.075 మీటర్లు. వెడల్పు 3.280 మీటర్లు. ఎత్తు 2.186 మీటర్లు. 94 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. రెండు రేంజ్ రోవర్ల శక్తితో సమానమని టెక్నీషియన్లు చెబుతున్నారు. దీనిని చూడడానికి యువతీయువకులు చాలా ఆసక్తి చూపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో దీనిని డ్రైవ్ చేసి విద్యార్థులకు చూపించారు. అంతా ఉత్సాహంగా ముందుకు వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఏయూలో ఎయిడెడ్ రచ్చ

రెండున్నరేళ్ల కిందట పలు ఎయిడెడ్ కళాశాలలు మూత

- అక్కడి అధ్యాపకులు 92 మంది అప్పటి వర్సిటీ అధికారుల ప్రోత్సాహంతో క్యాంపస్‌లో చేరిక
- నిబంధనలకు విరుద్ధమంటూ హైకోర్టులో ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కేసు
- డిగ్రీ కళాశాలలకు వెళ్లిపోయిన 50 మంది
- మిగిలినవారు కొనసాగింపు
- వారిని వెంటనే వెనక్కి పంపించాలని ఏయూ ఉపాధ్యాయ సంఘం డిమాండ్
- గెస్ట్ ఫ్యాకల్టీ ఆందోళన

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీపై వివాదం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీకి తీసుకువచ్చిన వారిని అధికారులు తక్షణం వెనక్కి పంపించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యాయ సంఘం (ఆట), వీసీ ప్రసాదరెడ్డి హయాంలో ఉద్వాసనకు గురైన గెస్ట్ ఫ్యాకల్టీ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే 'ఆట' అధ్యక్షులు ప్రొఫెసర్ జాలాది రవి, కార్యదర్శి ప్రొఫెసర్ ప్రేమానందం ఆధ్వర్యంలో పలువురు సీనియర్ ప్రొఫెసర్ల బృందం రిజిస్ట్రార్‌తోపాటు వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్‌ను కలిసి ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని డిమాండ్ చేసింది. మరోవైపు గెస్ట్ ఫ్యాకల్టీ శుక్రవారం ఎయిడెడ్ ఫ్యాకల్టీ



పనిచేస్తున్న విభాగాల వద్దకు వెళ్లి వారిని తొలగించాలని ఆందోళన నిర్వహించారు. ఈ వ్యవహారం రోజురోజుకూ ముదురుతుండడంతో వర్సిటీ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబు కొనసాగుతున్నారు. వీసీని ప్రభుత్వం నియమించలేదు. దీంతో వారిపై ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో తెలియక ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సందిగ్ధంలో ఉన్నారు. ప్రభుత్వానికి విషయాన్ని తెలియజేస్తానని ఆయన చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించకపోతే సహించేది లేదని సీనియర్ ప్రొఫెసర్లు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలోకి...

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఎయిడెడ్ కళాశాలలు రెండున్నరేళ్ల కిందట మూతపడ్డాయి. అప్పటికే ఆయా కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం డిగ్రీ కాలేజీలకు అటాచ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న వందలాది మంది అధ్యాపకులు డిగ్రీ కాలేజీలకు అటాచ్ అయ్యారు. అయితే, కొద్దిరోజుల తరువాత ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఒక నోటిఫికేషన్ మేరకు డిగ్రీ కాలేజీలకు అటాచ్ అయిన ఎంతోమంది వర్సిటీల్లో చేరారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో పలు వర్సిటీలు వారిని వెనక్కి పంపించేశాయి. అయితే, ఏయూ అధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా 113 మంది ఎయిడెడ్ ఫ్యాకల్టీని తీసుకున్నారు. ఈ క్రమంలో పెద్ద మొత్తం లో చేతులు మారాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అప్పట్లోనే ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అర్జునుడు హైకోర్టును ఆశ్రయించారు. డిగ్రీ కాలేజీల్లో బోధించే వారితో పీజీ విద్యార్థులకు పాఠాలు చెప్పించడం సాధ్యం కాదని, వారిని

... మిగతా 6వ పేజీలో

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర

- అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు
- పూర్తిస్థాయి అధికారిని నియమించేందుకు మరికొంత సమయం



విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎంసీ)ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గత రెండేళ్లుగా ఈ సంస్థకు ఎంసీ లేరని, కలెక్టర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారని, ఆయన బదిలీపై వెళ్లాక కూడా ఎవరినీ నియమించలేదంటూ నాలుగు రోజుల క్రితం 'పెద్ద దిక్కు లేని వీఎంఆర్‌డీఏ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని

... మిగతా 6వ పేజీలో

జాబ్ మేళాకు స్పందన



సూచనలు చేస్తున్న ఉపాధి కల్పన అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం, జూలై 5 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో శుక్రవారం చేపట్టిన జాబ్‌మేళాలో నగరం నలుమూలల నుంచి 106 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి నగరంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ, అనుభవం ప్రకారం 26 మందిని ఎంపిక చేసినట్టుజిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్. సుబ్బిరెడ్డికె. శాంతి పేర్కొన్నారు.

8, 9 తేదీల్లో కిరండోల్ రైలు రద్దు

విశాఖపట్నం, జూలై 5: వాల్తేరు డివిజన్ పరిధిలోని కేకే లైన్‌లో ఆధునీకీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 8న విశాఖ-కిరండోల్ (08551), ఈనెల 9న కిరండోల్ - విశాఖ (08552) రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు.

ఒలింపిక్స్‌కు ఎర్రాజీ జ్యోతి

... 5వ పేజీ తరువాయి

రికార్డులను తానే అధిగమించుకుంటూ దూసుకోపోతోంది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకాలు అందుకుంది. త్వరలో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో కూడా దేశానికి పతకం అందించడం ఖాయమని నిపుణులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



రోడ్డుపై నిర్మించిన మరుగుదొడ్డి చుట్టూ వ్యర్థాలు



రహదారికి అడ్డంగా నిల్వ చేసిన భవన నిర్మాణ సామగ్రి

కాలువ ఆక్రమించి నిర్మాణం.. అవస్థల్లో జనం

- మురుగు కాలువపై మరుగుదొడ్డి నిర్మాణం
- రహదారిపైకి చేరుతున్న వ్యర్థాలు
- సీతమ్మధార టీపీటీ కాలనీ వాసులు ఇబ్బందులు

సీతమ్మధార, జూలై 5: గ్రేటర్ 14వ వార్డు సీతమ్మధార టీపీటీ కాలనీలో నిర్మిస్తున్న ఓ అపార్టుమెంట్ యజమాని ఏకంగా మురుగు కాలువను ఆక్రమించి మరుగుదొడ్డి కమోడ్ నిర్మించేశారు. దీంతో భవనంలో పనిచేసే వారంతా ఈ బాతురూమ్‌లోనే మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతోపాటు భవన నిర్మాణ సామగ్రిని కాలువలో వేయడంతో మల, ముత్రాలు రోడ్డుపై చేరి పరిసరాలు దుర్గంధమయంగా మారుతున్నాయి. ఈ దుర్వాసన భరించలేకపోతున్నామంటూ స్థానికులు జీవీఎంసీ అధికారులకు, స్థానిక నాయకులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు వచ్చి పరిశీలించారు. దీంతో ఆ అపార్టుమెంట్ యజమానిని ప్రశ్నించడంతో ఆయన మరుగుదొడ్డిని తొలగిస్తామని తెలిపారు. అలాగే, అపార్టుమెంట్ రోడ్డును అక్రమంగా నిరిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపైనే ఇసుక, ఇటుక, పిక్క, సిమెంట్ యథేచ్ఛగా నిల్వ చేస్తున్నారని చెబుతున్నారు.

రహదారిపై నడిచి వెళ్లడానికికానీ, వాహనరాకపోకలకు వీలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సామగ్రితో వచ్చిన లారీలను రోడ్డుపై అడ్డంగా ఉంచుతూ అన్‌లోడ్ చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. మురుగు కాలువపై నిర్మించిన మరుగుదొడ్డిని తక్షణం తొలగించాలని కోరుతున్నారు.

జగన్నాథుడిని దర్శించుకున్న పోలీస్ అధికారులు



ఆలయంలో ఏసీపీలు, సీఐ, ఎస్ఐలు

పూర్ణామార్కెట్, జూలై 5: టౌన్ కొత్త రోడ్డులో కొలువైన జగన్నాథ స్వామిని నగర ట్రాఫిక్ ఏసీపీలు రాజీవ్ కుమార్, వాసుదేవలతో పాటు టుటౌన్ వన్‌టౌన్ సీఐ, ఎస్ఐలు శుక్రవారం దర్శించుకున్నారు. శనివారం నుంచి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఈవో టి. రాజగోపాలరెడ్డితో చర్చించారు. స్వామివారి రథాన్ని ఆలయం వద్ద తీసుకువస్తున్నట్టు ఈవో తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు జగన్నాథుని భక్తులు దర్శించుకుంటారన్నారు. ఈనేపథ్యంలో టౌన్ కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్ నియం త్రణకుసంబంధించి సీఐ,ఎస్ఐలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వారితో పూ జలు చేసి, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రథయాత్రలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు పురస్కరించుకుని ట్రాఫిక్ నియంత్రణపై ఏసీపీలు రాజీవ్‌కుమార్, వాసుదేవ, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. వారు టర్నర్ చౌల్ట్రీ వద్ద ట్రాఫిక్ పోలీసులతో చర్చించారు. రథయాత్ర రోజు టౌన్ కొత్తరోడ్డులో రథం ఊరేగింపు పూర్ణా మార్కెట్ మీదుగా టర్నర్ చౌల్ట్రీ వద్ద చేరుకొనేందుకు వీలుగా ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ విశ్వనాథ్, టుటౌన్ సీఐ రేవతమ్మ, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

జగన్నాథ స్వామి ఉత్సవాల కమిటీ నియామకం

జగాంబ కూడలి, జూలై 5: టౌన్ కొత్త రోడ్డు శ్రీ జగన్నాథ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుతమ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథ యాత్ర నిర్వహిస్తున్నారు. కూటమికి చెందిన కొంతమందిని ఉత్సవ కమిటీ సభ్యులను సిఫార్సు చేస్తూ దేవదాయశాఖ అధికారులకు ఆయన లేఖ రాశారు. దీంతో ఆలయ ఈవో రాజగోపాలరెడ్డికి తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీని నియమిస్తూ ప్రభు త్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. ఈ ఆర్డర్ కాపీలు ఈవో కార్యాలయానికి అందాయి.

'పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారు'

డాబాగార్డెన్స్, జూలై 5: తన కుమారుడి విషయంలో న్యాయం చేయాల్సిన పోలీసులే అక్రమ కేసులు బనాయించడం దారుణమని బాధితురాలు, దళిత సేన నగర అధ్యక్షురాలు సత్యవాణి ఆరోపించారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మైనర్ అయిన తన కుమారుడిపై ఓ కేసులో తప్పుడు ఎఫ్ఐఆర్ వేసి చట్టాన్ని దుర్వినియోగం చేసిన ఎస్ఐ దివ్యభారతి, సీఐ ప్రసాద్‌లపై విచారణ చేపట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో నెక్కలనాగమణి, మంగవేణి, ధనలక్ష్మి, అప్పారావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో సీవో, సచివాలయం సెక్రటరీలు

అక్కయ్యపాలెం, జూలై 5 : అతిసారం, ఇతర అంటు వ్యాధులనుంచి పిల్లలను రక్షించుకోవాలని 27వ వార్డు జీవీఎంసీ సీవో నిషాబేగం తల్లిదండ్రులను కోరారు. వార్డులోని దొండపర్తి పరిధి అమర్‌నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు వస్తున్నాయని, వాటి నుంచి దూరం కావాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో చెత్త, పనికిరాని వస్తువులను లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ గోపికృష్ణ, ఏఎన్ఎంలు సుశీల, శ్రీదేవి, ఆ్వలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

సీతంపేట, జూలై 5: ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయాన్ని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ టి. శ్రీనివాస, ప్రొఫెసర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ డి. హరినారాయణ శుక్రవారం సందర్శించారు. కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను చూపించారు. అనంతరం ప్రొఫెసర్ హరినారాయణ రుగ్వేదం 12 భాగాలు, యజుర్వే దం 3 భాగాలు, సామవేదం 2 భాగాలు, అథర్వణ వేదం 5భాగాలతో కలిగిన 22 పుస్తకాలు గలసెట్‌నుగ్రంథాలయానికివితరణగా అందించారు.

సమస్యలుంటే ఫోన్ చేయండి

- ఏఆర్ పోలీస్ సిబ్బందితో సీపీ శంఖబత్ర బాగ్చీ



సిబ్బంది నుంచి వందన స్వీకరిస్తున్న సీపీ శంఖబత్ర బాగ్చీ

మహారాణిపేట, జూలై 5: పోలీసు కమిషనర్ శంఖ బత్రబాగ్చీ శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో కవాతును పరిశీలించారు. ముందుగా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మైదానం లోపల గల సిబ్బంది టర్న్‌ఔట్‌లను నిశితంగాపరిశీ లించారు. ప్రతీ జిల్లాలో ఏఆర్ ఫోర్సు చాలా ప్రధానమని, సమస్య వచ్చినప్పుడు ఓ ఆయుధంలో పని చేస్తుందని సీపీ కొనియాడారు. అందరికీ అందుబాటులో ఉండేలా తాను ఫోన్: 79950 95799 నంబర్ అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. పోలీసు సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు ఏ అవసరమున్నా తనను సంప్రదించవచ్చునన్నారు. అవసరమైన సమయంలో సెలవు ఇవ్వకున్నా, రావాలిసన బకాయిలు పెండింగ్‌లో ఉన్నా, ఇతరేతర ఎవరైనా ఇబ్బంది పెట్టినా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు. మీరంతా ఆనందంతో ఉంటూ, విధుల్లో పాల్గొంటే తనకు సంతృప్తి ఉంటుందని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- న్యాయమూర్తి వెంకట శేషమ్మ



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

కంచరపాలెం, జూలై 5 : విద్యార్థులు, యువత సైబర్ నేరాలు,ట్రాఫిక్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ విశాఖపట్నం సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ కోరారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్ చట్టాలు, సైబర్ నేరాలు, చట్టాలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకట శేషమ్మ హాజరై విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. మైనర్లు వాహనాలను నడపరాదని,ట్రాఫిక్ నియమాలు పక్కాగా పాటించాలని కోరారు. హెల్మెట్ ధారణ అత్యంత ముఖ్యమన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు అమలు శిక్షలు, చట్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంచరపాలెం సీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జామి దివ్య భారతి, అధ్యాపకులు డా.బి.వి. లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాక్షి కవితల సంపుటి ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, సాహితీవేత్తలు

సీతంపేట, జూలై 5: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, ఆకాశవాణి పూర్వ అధికారి రొక్కం కామేశ్వరరావు రచించిన శతాక్షి కవితల సంపుటి మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కవితా సంపుటి వర్తమాన కాలానికి తగిన రీతిలో ఉందన్నారు. యువతరానికి కవిత్వం రాయాలనే స్ఫూర్తి నిస్తుందని పేర్కొన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కేజీ వేణు పుస్తకాన్ని సమీక్షించారు. బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీవీ సూర్యారావు, అరసం ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, కార్యదర్శులు పి.శ్యామ్ సుందర్, డాక్టర్ సి. ఎస్. క్షేత్రపాల్‌రెడ్డి, ఇతర సభ్యులు కవి కామేశ్వరరావుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.ఆర్.కె. రావు, బొట్ట అప్పారావు, పల్లా జగదీశ్వరరావు, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి, ఆచార్య వెలమల సిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలలు యాచన వృత్తి చేపట్టకుండా చూడాలి



సీపీని కలిసిన బాలల హక్కుల పరిరక్షణ సభ్యుడు సీతారాం తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 5: విశాఖ నగరంలో బాలలు యాచన వృత్తిలో కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. శుక్రవారం సీపీని కలిసి నగరంలో బాల ల సమస్యలపై మాట్లాడారు. వి విధ కూడళ్లలో చిన్నారులు యాచన చేస్తూ కనిపిస్తున్నారని పేర్కొన్నార న్నారు. వివిధ పాఠశాలల వద్ద ఆకతాయిలు విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బాలల హక్కులు, వారి పరిరక్షణకు పూర్తి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. నగరంలో యాచకులుగా తిరుగుతున్న బాలలను తమ యంత్రాంగం ద్వారా పూర్తి సమాచారం సేకరిస్తామన్నారు. అనం తరం వారిని ఆ వృత్తినుంచిదూరం చేసేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొబెషనరీ అధికారి శరత్‌కుమార్, నగర కన్వీనర్ కె. ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర రేపు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 5: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీన జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నట్టు ఇస్కాన్ సంస్థ నగర అధ్యక్షుడు సాంబదాస తెలిపారు. నగరంలో ఒక హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను తెలిపారు. గత 16 సంవత్సరాలుగా నగరంలో దిగ్విజయంగా పూరిలోని జగన్నాథస్వామి తరహాలోనే స్వామివారి రథయా త్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 7 వతేదీ సాయంత్రం 4 గంటలకు సాగరతీరంలో ఉడాపార్కు నుంచి వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణ మిషన్ మీదుగా గురజాడ కళా క్షేత్రం వరకు ఈ రథయాత్ర కొనసాగుతుందన్నారు. స్వామి వారికి 1008 రకాల వంటకాలను మహా ప్రసాదంగా సమర్పిస్తామన్నారు. స్వామి వారికి హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తామని వివరించారు. ఈ రథయాత్రలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రి కె . రామోహన్‌నాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మాతాజీ నితాయినీ సేవిని, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సంఘ నాయకులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి కోరారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. గ్రామీణ వైద్యులకు గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గెద్ద చిరంజీవి, మమ్ముల తిరుపతిరావు, కర్రి సత్యనారాయణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లోనే మంచినీటి పైప్‌లైన్లు

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నీటి కాలుష్యానికి ప్రధాన కారణమైన డ్రైనేజీల్లోని పైప్‌లైన్‌లను సురక్షిత ప్రాంతానికి మార్చడాన్ని మాత్రం విస్మరిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో సుమారు 3.2 లక్షల కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇంటింటికీ సరఫరా కోసం ఏలేరు, తాటిపూడి, రైవాడ, మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నుంచి ప్రతిరోజూ 65 మిలియన్ గ్యాలన్ల నీటిని తీసుకువస్తున్నారు. ఆ నీటిని శుద్ధి చేసి, తగిన మోతాదులో క్లోరినేషన్ చేసిన తర్వాత 291 అంతర్గత మినీ రిజర్వాయర్ల ద్వారా నగరమంతటికీ సరఫరా చేస్తున్నారు. మినీ రిజర్వాయర్ల నుంచి ఇళ్లకు సరఫరా చేసేందుకు అంతర్గతంగా సుమారు మూడు వేల కిలోమీటర్లు పొడవున పైప్‌లైన్లు వేశారు. అయితే మహారాణిపేట, కంచరపాలెం, మల్కాపురం, గాజువాక, మద్దిలపాలెం, వన్‌టౌన్, అల్లిపురం, అక్కయ్యపాలెం, ముస్లింతాటిచెట్లపాలెం వంటి ప్రాంతాల్లో ఈ పైప్‌లైన్లు గెడ్డలు, డ్రైనేజీల గోడలకు అనుకునే ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తుంటాయి. అటువంటి సమయంలో కొళాయి పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరేందుకు ఆస్కారం ఉంటుంది. కొన్నిచోట్ల డ్రైనేజీల్లోనే కొళాయిల జాయింట్‌లు ఉండడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని నగరవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.అధికారులు అటువంటి పైప్‌లైన్ల మార్పుపై దృష్టిపెట్టకుండా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలతో హడావుడి చేస్తున్నారంటూ జీవీఎంసీ సిబ్బంది పెదవివిరుస్తున్నారు. ఈ విషయం నీటి సరఫరా విభాగం అధికారుల వద్ద ప్రస్తావించగా నీటి కాలుష్యానికి అవకాశమే లేదని కొట్టిపారేస్తున్నారు.

నాడు-నేడు పనులపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

అవరోధం కలిగింది. దీనికితోడు పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలకు పనులు అప్పగించడంతో ప్రధానోపాధ్యాయులతో అనేకచోట్ల ఇబ్బందులు తలెత్తాయి.

గడచిన రెండేళ్లలో రూ.114.48 కోట్లకుగాను రూ.48.73 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం, మరో రూ.43.65 కోట్ల విలువైన సిమెంట్, ఇసుక, ఇనుము, ఇతర మెటీరియల్ సరఫరా చేసింది. నిధులు, సిమెంట్ కొరతతో పలుచోట్ల భవనాలు శ్లాబ్‌ల వరకు వచ్చి ఆగిపోయాయి. మరికొన్నిచోట్ల నిధులున్నా సిమెంట్ కొరతతో పనులు సాగలేదు. రాష్ట్రంలో అతిపెద్ద పాఠశాల చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో నిధుల కొరతతో నాలుగైదు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి అధికారంలోకి రావడంతో నాడు-నేడు పనులపై తొలుత కొంత ఆందోళన వ్యక్తమైంది. అయితే నాడు-నేడు పనులపై మంత్రి లోకేశ్‌కు ఉన్నతాధికారులు వాస్తవాలు చెబుతూ నిధులు విడుదల చేస్తే వసతులు సమకూరతాయని వివరించారు. ఈ నేపథ్యంలో నాడు-నేడు పేరు మార్పునకు ఆదేశించిన లోకేశ్ రెండు, మూడు వారాల్లో నిధుల విడుదలపై ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'నాడు-నేడు' పథకం పేరును 'పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపు'గా మార్పుచేయనున్నట్టు తెలిసింది.

విశాఖ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేందుకు రూ.16 కోట్లు అవసరమని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఇంకా కొన్ని పాఠశాలలకు సిమెంట్ సరఫరా చేయాలని లేకపోతే స్థానికంగా కొనుగోలుకు అనుమతిస్తే సరిపోతుందని చెబుతున్నారు.

ఏయూలో ఎయిడెడ్ రచ్చ

... 5వ పేజీ తరువాయి

వెనక్కి పంపించేయాలంటూ కోరారు. హైకోర్టు స్టే విధించింది. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలు ఎయిడెడ్ ఫ్యాకల్టీని తీసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. ఏయూ అధికారులు మాత్రం 113 మందిని తీసుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, కోర్టులో ఉండడంతో భయపడి 92 మంది మాత్రమే వచ్చి చేరారు. ఈ విషయాన్ని అర్జును డు మరోసారి కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా, కాలేజియేట్ కమిషనర్‌ను పిలిచింది. దీంతో వెనక్కి వచ్చేయాలంటూ అప్పటి కాలేజియేట్ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడంతో ఏయూలో చేరిన 50 మంది ఎయిడెడ్ ఫ్యాకల్టీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు వెళ్లిపోయారు. ఆ తరువాత నుంచి ఈ కేసు వాయిదాలు పడుతూ వస్తోంది. ఇప్పటికీ 39 మంది వర్సిటీలోనే కొనసాగుతున్నారు. వీరికి మొదట డిగ్రీ కాలేజీల నుంచి జీతాలు చెల్లించగా, ఆ తరువాత నుంచి వర్సిటీ నిధులు నుంచి చెల్లిస్తున్నారు. వీరంతా వర్సిటీలోని హిస్టరీ, పాలిటిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిని వర్సిటీలో చేర్చుకోవడమే నిబంధనలకు విరుద్ధమైతే కొందరికి హెచ్‌వోడీలుగా, డీన్లుగాను అధికారులు అప్పటి వర్సిటీ అధికారులు బాధ్యతలను అప్పగించారు. వీరంతా ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా వర్సిటీలో కొనసాగుతున్నారు.

యూజీసీ నిబంధనలకు విరుద్ధం

అసోసియేట్ ప్రొఫెసర్ కావాలంటే 12 ఏళ్లపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడంతోపాటు యూజీసీ కేర్ జర్నల్స్‌లో పబ్లికేషన్స్ ఉండాలి. అదేవిధంగా ఐదుగురు పీహెచ్‌డీ విద్యార్థులను తప్పనిసరిగా గైడ్ చేసి ఉండాలి. ఈ నిబంధనలను పాటించకుండానే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా తీసుకున్నారని చెబుతున్నారు.

ఎయిడెడ్ ఫ్యాకల్టీ వాదన ఇదీ

ఎయిడెడ్ ఫ్యాకల్టీ మాత్రం భిన్నమైన వాదనను వినిపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము డిగ్రీ కాలేజీల్లో చేరామని, ఉన్నత విద్యాశాఖ అధికారులు వర్సిటీల్లో చేరే ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలంటూ నోటిఫికేషన్ ఇచ్చారని, ఆ విధంగా తాము వచ్చామని చెబుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడే ఉంటామన్నారు. ఎయిడెడ్ కాలేజీలను అర్థాంతరంగా మూసేయడం వల్ల ప్రశాంతంగా సాగిపోతున్న తమ జీవితాలు రోడ్డునపడ్డాయన్న భావనను వారు వ్యక్తం చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర

... 5వ పేజీ తరువాయి

నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అంతవరకు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచకుండా ప్రస్తుతం అక్కడే జాయింట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి.రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించింది. పురపాలక శాఖకు చెందిన రవీంద్ర గత మూడేళ్లుగా వీఎంఆర్‌డీఏలో జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రాజెక్ట్స్ అకౌంట్స్ విభాగాల బాధ్యతలను నిర్వహించారు. కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ ప్రాజెక్టు నిర్వహణదారు నుంచి రూ.2 కోట్లకు పైగా బకాయి రావలసి ఉంటే దానిని కోర్టు ద్వారా స్వాధీనం చేసుకొని వీఎంఆర్‌డీఏ ద్వారానే నిర్వహిస్తున్నారు. దీనివల్ల గత ఆరు నెలలలోనే రూ.2 కోట్ల ఆదాయం సంస్థకు సమకూరడం గమనార్హం.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

ఉచిత సర్వీసులేనని గుర్తుచేశారు.

త్వరలో స్మార్ట్ మీటర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. మొత్తం పది లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. తొలి దశలో 3 వేల ఫీడర్లు, 1.3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఆ తరువాత 1.4 లక్షల ప్రభుత్వ సర్వీసులు, ఆపై వాణిజ్య, పరిశ్రమలకు ఈ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి ఇస్తామన్నారు. తక్కువ విద్యుత్ వాడేవారికి, ఉచిత విద్యుత్ తీసుకునేవారికి ఈ మీటర్ల అవసరం ఉండదన్నారు. ఇవి ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయన్నారు. వీటిని అమర్చిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ కోతలు విధించకూడదని, డిస్‌కనెక్ట్ చేయకూడదని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ సమయాన్ని 'హ్యాపీ అవర్స్'గా ప్రకటించిందన్నారు.

వీధి దీపాల నిర్వహణకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్

అగనంపూడి, జూలై 5: గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణకు చర్యలు తీసుకుంటానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈపీడీసీఎల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ వీధి దీపాల అవసరమో నివాసితులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో కొత్త స్తంభాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధంగా చేయాలని ఈపీడీసీఎల్ సిబ్బందికి సూచించారు.ప్రస్తుతం గ్రామాల్లో వెలగని వీధి దీపాలను గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గ్రామాల్లో పూర్తిస్థాయి వీధి దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట కోటేశ్వరరావు, రామారావు, శ్రీను, ఏఈ వినోద్ ఉన్నారు.

21న గురుపౌర్ణమి వేడుకలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి, జూలై 5: అగనంపూడి షిర్డీసాయి ఆలయంలో ఈనెల 21వతేదీన నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయంలో షిర్డీసాయి సేవా సమితి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి మాట్లాడారు. ఆలయంలో భారీ ఎత్తున గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు వ్యాస శర్మ, పీఎల్ఎన్ రాజు, సత్యనారాయణ, గోవిందరావు, పవన్‌కుమార్, సత్యలక్ష్మీ, ఆర్. సత్యశ్రీదేవి, పద్మావతి, పంకజ, కుమారి, పద్మాజారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణంలో శ్రీసీతారాములు

అగనంపూడి, జూలై 5: జీవీఎంసీ 85వ వార్డు పరిధి లేమర్తి రామాలయం వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో సీతారాముల వారికి పంచామృతాభిషేకాలతోపాటు పూర్ణాహుతి, ప్రత్యేక హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో సీతారాముల వారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు దాసరి ఆదిత్య, ప్రసాద్, సత్యనారాయణ, పప్పల కనకారావు, దాసరి గణేశ్, దాసరి సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 5: స్టీల్‌ప్లాంట్ ఉక్కునగరం క్లబ్ నూతన పాలకవర్గానికి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. కార్యదర్శి పదవికి ఇద్దరు, సహాయ కార్యదర్శి పదవికి ఇద్దరు, కోశాధికారి పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. ఓటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి వివరించారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 38, టమాటా 38, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 27, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 30, దొండకాయలు 27, బంగాళదుంపలు 32, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 80, అల్లం 145, బరబాటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 30, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	112
ఫారం ధర	132
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పార్కుల అభివృద్ధిపై చర్యలేవీ?

- అందంగా తీర్చిదిద్దుతామన్న అధికారులు
- నాలుగేళ్లుగా స్థానికుల ఎదురుచూపులు
- పార్కు స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

పెదగంట్యాడ, జూలై 5: పెదనడుపూరు శివారు నుంచి గాజువాక కణితి రోడ్డు జంక్షన్ వరకు రెండు సమాంతర రోడ్ల మధ్య ఉన్న వుడా స్థలాన్ని అందమైన పార్కులుగా తీర్చిదిద్దుతామని నాలుగేళ్ల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఈ స్థలాలకు నాలుగు వైపులా కొన్ని చోట్ల ప్రహరీలు కడితే మరికొన్ని చోట్ల ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ స్థలాలు పార్కులుగా రూపాంతరం చెందుతాయని స్థానికులు సంబరపడ్డారు. అయితే నాలుగేళ్లగా ఎదురు చూపులే తప్ప పార్కులు కనిపించలేదు. పెదనడుపూరు, అంబేడ్కర్‌కాలనీ, సింహగిరికాలనీ, కణితి రోడ్డు, వినాయకనగర్, వెంపల్లినగర్, వుడా కాలనీలకు చేరువగా సుమారు కిలోమీటరు పొడవున వరుసగా పార్కులున్నాయి. ఆహ్లాదకరంగా ఉన్న వాటిపై ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు దృష్టి సారించలేదు. ఒక్క చోట సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అయితే పార్కు పిచ్చి మొక్కలుతో నిండి ఉండటంతో స్థానికులు ఆసక్తి చూపడంలేదు.



అంబేడ్కర్ కాలనీలో పార్కు స్థలం



వినాయునగర్ వద్ద వృథాగా ఇలా...



నడుపూరులో ఖాళీగా పార్కు స్థలం

పార్కు స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. దీంతో పాములు ఇతర విషకీటకాలు, పశువులు సంచరిస్తున్నాయి. పల ఎకాలనీలకు కనెక్టవిటీగాను విశాలంగా ఉన్న ఇలాంటి పార్కు గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో మరెక్కడా లేదు. అయినప్పటికి దీనికి నిర్లక్ష్యం నీడ వెంటాడుతోంది. జీవీఎంసీ 71,73,74 వార్డుల సరిహద్దులో ఉండటంతో కార్పొరేటర్లు దృష్టి సారించడంలేదు.

నమూనా పార్కులుగా తీర్చిదిద్దాలి



పార్కుస్థలాలను అభివృద్ధి చేసి, అందమైన మొక్కలు, పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు పట్టించుకోలేదు. పార్కు స్థలాలను ఇతర అవసరాలకు వినియోగించకుండా చూడాలి. పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ నిధులు కేటాయించేలా స్థానిక కార్పొరేటర్లు చొరవ తీసుకోవాలి.

- ఎన్.సాధూరావు, పారిశ్రామిక ప్రాంతం

సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే గణబాబు సమీక్ష



జోన్ 8 అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

వేపగుంట, జూలై 5: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల్లో జరగాల్సిన, జరుగుతున్న పనులపై రెవెన్యూ, జీవీఎంసీ, విద్యుత్, హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం జోన్ 8లో జరుగుతున్న అభివృద్ధి పనులు, యూజీడీ, పబ్లిక్ వర్క్స్, విద్యుత్ సమస్యలపై ఆయా విభాగాల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వార్డు ప్రతినిదులు కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారులు సత్వరం స్పందించాలని ఎమ్మెల్యే సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులతో కలిసి వార్డుల్లో పర్యటించనున్నామని ఆయన పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మిడిరమణ, దాడి వెంకటరమేష్, జోన్ 8 జెడ్సీ కె.హేమావతి, ఈఈ రత్నాకర్ రెడ్డి, డీఈ విజయకుమార్, ఆర్.ఓ.నారాయణరావు, ఏపీడీ శ్రీరామ్, హౌసింగ్, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

అండర్ పాస్‌వేలో రాకపోకలు ప్రారంభం



చంద్రనగర్ అండర్‌పాస్‌వే, గోడకు ఏర్పాటు చేసిన కన్వెక్స్ మిర్రర్

గోపాలపట్నం, జూలై 5: సింహాచలం రైల్వేస్టేషన్ వెనుక భాగంలో ఇటీవల నిర్మించిన చంద్రనగర్ అండర్‌పాస్‌వేలో శుక్రవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. గత ఏడాది డిసెంబరులో అండర్‌పాస్‌వే కోసం పుష్‌బాక్స్‌లను ఏర్పాటు చేసిన తరువాత రిటైనింగ్‌వాల్, రహదారి నిర్మాణానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఇటీవల రహదారి నిర్మాణం పూర్తికావడంతో అండర్‌పాస్‌వే లోపలి భాగంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు రాకపోకలు సాగించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడకుండా మలుపుల వద్ద కన్వెక్స్ మిర్రర్‌లను ఏర్పాటు చేశారు. గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన కొత్తపాలెం, చంద్రనగర్, ఎల్లపువానిపాలెం, కోటనరవ, నరవ, చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు ప్రస్తుతం ఈ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. గోపాలపట్నంలో ఆర్‌వోబీ నిర్మాణం కోసం మూడు దశాబ్దాలుగా ఉన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోయినా ఇటీవల రైల్వేశాఖ నిర్మించిన ఈ అండర్‌పాస్‌వే స్థానికులకు ఊరటనిచ్చింది. ఇప్పటి వరకూ రైలు గేట్ల కారణంగా రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడిన వాహన చోదకులకు సాంత్వన కలిగింది.



అన్నమాచార్యుల గీతాలకు కోలాటం ఆడుతున్న మహిళలు



స్వామిని దర్శించుకున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

గ్రీన్ సిటీలో వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కూర్మన్నపాలెం, జూలై 5: గ్రీన్‌సిటీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారం బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆలయం భక్తుల స్వామివారి నామస్మరణతో మారుమోగింది. ఉత్సవాల్లో భాగంగా స్వామికి విశేష అభిషేకాలు, పుష్పార్చనలు, శ్రీపుష్పయాగం, హోమాలు, ద్వాదశ తిరువాదరణ, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీధర్, వాసు, హరీష్ ఆధ్వర్యంలో వారం రోజులుగా శ్రీవారిని గజ, తురగ, గరుడ, శేష, కల్పవృక్ష, హనుమంత, సింహ వాహనాలపై పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అన్నమాచార్య, భజన గీతాలు ఆలపించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సంస్థ బృందంతో 518 మంది మహిళలు సామూహికంగా అన్నమాచార్య గీతాలకు కోలాటం ప్రదర్శించారు. సంకీర్తనామృతం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేష్ కుమార్, పద్మజ, డైరెక్టర్ వీవీ కృష్ణారావు పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, స్టీలుప్లాంట్ సీఎండీ అతుల్‌భట్, డైరెక్టర్ కమర్షియల్ జీవీఎన్ ప్రసాద్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు, కె.వెంకట రమణ, పొన్నగంటి మురళీమోహన్, పద్మజ, రాజ్యలక్ష్మీ, శాంతి, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేష్, నానాజీ, భక్తులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

ఘనంగా హజరత్ బాబా చందనోత్సవం

కూర్మన్నపాలెం, జూలై 5: ఫకీర్ తక్యాలో హజరత్ బాబా మిస్కీన్‌షా ఔలియా రహ్మతుల్లా అలైహి 104వ వార్షిక చందనోత్సవం అంజుమన్ నూర్ ఎ దర్గా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ముస్లిం సోదరులకు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 86వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ప్రార్ధనలో పాల్గొన్నారు. షేక్ ఇమామ్ హుస్సేన్, మహ్మద్ ఖాళీద్, ఎంటీ మూసా, అయూబ్, మీరా, నజువుద్దీన్, గులిం, చోటు, టీడీపీ నాయకులు వేగుంట శ్రీనివాస్, గొలగాని సన్యాసిరావు, ఎం.కనకరాజు, గణపతి పాల్గొన్నారు.



చందనోత్సవంలో నల్లూరు సూర్యనారాయణ, ముస్లిం సోదరులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి

పెదగంట్యాడ, జూలై 5: పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని 64వవార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు గొడ్డువానిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగాలన్నారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతబాబు, నేతలు పి.నాగేశ్వరరావు, రంగనాయకులు పాల్గొన్నారు.

డ్రైడేను విధిగా పాటించాలి

పెదగంట్యాడ: ప్రతి ఇంట్లో ఫ్రైడే ను డ్రైడేను విధిగా పాటించాలని యాతపాలెం, దిబ్బపాలెం సచివాలయాల శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు రామారావు, అప్పారావు సూచించారు. అశోక్‌నగర్‌లో శుక్రవారం స్థానికులను అవగాహన కల్పించారు. దోమలతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల డ్రైడే పాటించాలని కోరారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మల్కాపురం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వాములై విశాఖకు ర్యాంక్ వచ్చేలా సహకరించాలని మలేరియా విభాగం అధికారులు పేర్కొన్నారు. జనతా కాలలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించారు. సురక్షిత నీటిని తాగాలని, ఇళ్లలోని తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వేణుబాబు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

మల్కాపురం: ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మపేరిట ఓ మొక్క నాటుదాం కార్యక్రమం ములగాడ మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పోలిమేర శ్రీను, కొక్కలిగడ్డ విజయ్‌బాబు, దానేష్, గురుమూర్తి, రామకృష్ణ, అజయ్, ఆర్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కరణంరెడ్డి, గోవిందరెడ్డి

సీజనల్ వ్యాధులపై అవగాహన

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. శానిటరీ, మలేరియా సిబ్బంది అవగాహన కల్పించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటును నిర్లక్ష్యం చేస్తే వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి జీవీఎంసీ సిబ్బందికి అందించాలని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. జనసేన ఇన్‌ఛార్జి కాద శ్రీను, ఎం.కనకరాజు, వేగుంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణ



స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ పెరిగిన పొదలు

గోపాలపట్నం, జూలై 5: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసరాలు దుర్భరంగా మారడంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ దట్టమైన పొదలు, తుప్పలు పెరిగిపోవడంతో విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడికి ప్రతిరోజూ క్రీడాకారులు, ప్రజలు వ్యాయామం చేయడానికి, ఆడుకోడానికి వస్తుంటారు. పరిసరాలు దుర్భరంగా మారడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

'కనీస పెన్షన్ రూ.9 వేలుగా నిర్ణయించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ, జూలై 5: కేంద్ర ప్రభుత్వ రంగ విశ్రాంత కార్మికుల కనీస పెన్షన్ రూ. 9వేలుగా నిర్ణయించాలని విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో శుక్రవారం నిర్వహించిన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత శాఖ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఈపీఎస్ 95ను అనుసరించి రిటైర్డ్ కార్మికులకు ప్రస్తుతం వెయ్యి నుంచి రూ.3 వేల పెన్షన్ ఇస్తోందని, ఇది మందుల ఖర్చులకే సరిపోవడం లేదన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లి దీనబంధు మాట్లాడుతూ జీవితకాలం సేవలందించి వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు కణితి అప్పల రాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి హుస్సేన్, అసోసియేషన్ సభ్యులు సీహెచ్ నారాయణరావు, ములకలపల్లి పెంటయ్య, పిట్ట గురునాథ్, నమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. వచ్చేనెల 6,7,8 తేదీల్లో న్యూఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సమావేశం తీర్మానించింది.

ఒకే ప్రాంగణం... రెండు కళాశాలలు

- కో ఎడ్యుకేషన్‌తో జూనియర్ కళాశాల
- బాలికలకు ప్రత్యేకంగా హైస్కూల్ ప్లస్



మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల

మల్కాపురం, జూలై 5: మల్కాపురం జీవీఎంసీ పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్లస్ తరగతులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇంటర్‌మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం రెండు కళాశాలను ఒక్కచోట నిర్వహించరాదనే నిబంధనలున్నా మరోచోట ఓ కళాశాల తరలింపునకు స్థలం లేకపోవడంతో ఇక్కడే కొనసాగిస్తున్నారు. దీంతో ఓకేచోట మహిళ కళాశాల, కో ఎడ్యుకేషన్ కళాశాలతో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఇక్కడి కళాశాలల్లో చేరేందుకు శ్రద్ధ చూపుతున్నారు. ప్రధానంగా హైస్కూల్ ప్లస్ (మహిళ) కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు, ల్యాబ్ సౌకర్యం ఉంది. ఇదే ప్రాంగణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు, ఇంగ్లీష్ మీడియం తరగతులను నిర్వహిస్తున్నారు. రెండు కళాశాలలకు విశాలమైన మైదానం ఉంది. సింధియా నుంచి గాజువాక డిపో వరకు ఉన్న పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థులకు ఈ కళాశాల ఉపయోగపడుతోంది. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.

'ఉత్పత్తి పెంపుపై ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యం'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 5: ఉక్కు ఉత్పత్తి రోజు రోజుకు తగ్గిపోతున్నా, యాజమా న్యం నిర్లక్ష్యం వహిస్తుండడం దారుణమని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రగతి ఉత్పత్తిపై ఆధారపడి ఉందని, కానీ ఆ దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోవటంతో విఫలమైందన్నారు. మరోవైపు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవిరి అవతారం, ఎస్.ఎ.నాయుడు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, కొమ్ము ప్రసాద్, వెంకటరాజు, గంగవరం గోపి పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రసాద్, తదితరులు

పెందుర్తి, జూలై 5: అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో పలు పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి వితరణగా అందించారు. సరిపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, నీలకంఠాపురం, దొగ్గవానిపాలెం, పాపయ్యరాజుపాలెం, పల్లెనారాయణపురం, గొల్లవిల్లిపాలెం ప్రాథమిక, గుర్రమ్మపాలెం, పెందుర్తి ఉన్నత పాఠశాలల్లో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లూరు ప్రసాద్ వీటిని అందించారు. సుమారు 15 ఏళ్లగా ట్రస్ట్ ఆధ్వర్యంలో 12 పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఏటా నోటు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పది మందికి రూ.10వేలు చొప్పున స్కాలర్‌షిప్‌గా ఇస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సేనాపతి హేమంత్, స్థానికులు కలిగి రాము, కృష్ణ, బొద్దపు పరమేశ్వరరావు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ



ఆరిలోవలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హౌసింగ్ అధికారులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ సంస్థకు 45 వసంతాలు పూర్తి కావడంతో ఆ సంస్థ అధికారులు శుక్రవారం అనాథలు, వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఆరిలోవలో చిన్నపిల్లలు, వృద్ధుల అనాథ ఆశ్రమం, నగరంలో మరో వృద్ధాశ్రమానికి నెల రోజులకు సరిపడ సరకులు, కూరగాయలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి.అఖిల, ఈఈ జి.సత్యనారాయణ, సీతారామ్, రామకృష్ణ, సూర్యప్రకాష్, సూర్యారావు, గోపీ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన


సూచనలు చేస్తున్న ఉపాధి కల్పన అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం, జూలై 5 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో శుక్రవారం చేపట్టిన జాబ్‌మేళాలో నగరం నలుమూలల నుంచి 106 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి నగరంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ, అనుభవం ప్రకారం 26 మందిని ఎంపిక చేసినట్టుజిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్. సుబ్బిరెడ్డికె. శాంతి పేర్కొన్నారు.

8, 9 తేదీల్లో కిరండోల్ రైలు రద్దు

విశాఖపట్నం, జూలై 5: వాల్తేరు డివిజన్ పరిదిలోని కేకే లైన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 8న విశాఖ-కిరండోల్ (08551), ఈనెల 9న కిరండోల్ - విశాఖ (08552) రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు.

ఒలింపిక్స్‌కు ఎర్రాజీ జ్యోతి

... 5వ పేజీ తరువాయి

రికార్డులను తానే అధిగమించుకుంటూ దూసుకోపోతోంది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకాలు అందుకుంది. త్వరలో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో కూడా దేశానికి పతకం అందించడం ఖాయమని నిపుణులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.


రోడ్డుపై నిర్మించిన మరుగుదొడ్డి చుట్టూ వ్యర్థాలు


రహదారికి అడ్డంగా నిల్వ చేసిన భవన నిర్మాణ సామగ్రి

కాలువ ఆక్రమించి నిర్మాణం.. అవస్థల్లో జనం

» మురుగు కాలువపై మరుగుదొడ్డి నిర్మాణం
» రహదారిపైకి చేరుతున్న వ్యర్థాలు
» సీతమ్మధార టీపీటీ కాలనీ వాసులు ఇబ్బందులు

సీతమ్మధార, జూలై 5: గ్రేటర్ 14వ వార్డు సీతమ్మధార టీపీటీ కాలనీలో నిర్మిస్తున్న ఓ అపార్టుమెంట్ యజమాని ఏకంగా మురుగు కాలువను ఆక్రమించి మరుగుదొడ్డి కమోడ్ నిర్మించేశారు. దీంతో భవనంలో పనిచేసే వారంతా ఈ బాతురూమ్‌లోనే మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతోపాటు భవన నిర్మాణ సామగ్రిని కాలువలో వేయడంతో మల, ముత్రాలు రోడ్డుపై చేరి పరిసరాలు దుర్గంధమయంగా మారుతున్నాయి. ఈ దుర్వాసన భరించలేకపోతున్నామంటూ స్థానికులు జీవీఎంసీ అధికారులకు, స్థానిక నాయకులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు వచ్చి పరిశీలించారు. దీంతో ఆ అపార్టుమెంట్ యజమానిని ప్రశ్నించడంతో ఆయన మరుగుదొడ్డిని తొలగిస్తామని తెలిపారు. అలాగే, అపార్టుమెంట్ రోడ్డును అక్రమంగా నిరిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపైనే ఇసుక, ఇటుక, పిక్క, సిమెంట్ యథేచ్ఛగా నిల్వ చేస్తున్నారని చెబుతున్నారు.

రహదారిపై నడిచి వెళ్లడానికికానీ, వాహనరాకపోకలకు వీలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సామగ్రితో వచ్చిన లారీలను రోడ్డుపై అడ్డంగా ఉంచుతూ అన్‌లోడ్ చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. మురుగు కాలువపై నిర్మించిన మరుగుదొడ్డిని తక్షణం తొలగించాలని కోరుతున్నారు.

జగన్నాథుడిని దర్శించుకున్న పోలీస్ అధికారులు


ఆలయంలో ఏసీపీలు, సీఐ, ఎస్‌ఐలు

పూర్ణామార్కెట్, జూలై 5: టౌన్ కొత్త రోడ్డులో కొలువైన జగన్నాథ స్వామిని నగర ట్రాఫిక్ ఏసీపీలు రాజీవ్ కుమార్, వాసుదేవలతో పాటు టుటౌన్ వన్‌టౌన్ సీఐ, ఎస్‌ఐలు శుక్రవారం దర్శించుకున్నారు. శనివారం నుంచి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఈవో టి. రాజగోపాలరెడ్డితో చర్చించారు. స్వామివారి రథాన్ని ఆలయం వద్ద తీసుకువస్తున్నట్టు ఈవో తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు జగన్నాథుని భక్తులు దర్శించుకుంటారన్నారు. ఈనేపథ్యంలో టౌన్ కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్ నియం త్రణకుసంబంధించి సీఐ,ఎస్‌ఐలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వారితో పూ జలు చేసి, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రథయాత్రలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు పురస్కరించుకుని ట్రాఫిక్ నియంత్రణపై ఏసీపీలు రాజీవ్‌కుమార్, వాసుదేవ, ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐలకు ఆదేశాలు జారీ చేశారు. వారు టర్నర్ చౌల్ట్రీ వద్ద ట్రాఫిక్ పోలీసులతో చర్చించారు. రథయాత్ర రోజు టౌన్ కొత్తరోడ్డులో రథం ఊరేగింపు పూర్ణా మార్కెట్ మీదుగా టర్నర్ చౌల్ట్రీ వద్ద చేరుకొనేందుకు వీలుగా ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ లక్ష్మణరావు, ఎస్‌ఐ విశ్వనాథ్, టుటౌన్ సీఐ రేవతమ్మ, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

జగన్నాథ స్వామి ఉత్సవాల కమిటీ నియామకం

జగాంబ కూడలి, జూలై 5: టౌన్ కొత్త రోడ్డు శ్రీ జగన్నాథ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుతమ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథ యాత్ర నిర్వహిస్తున్నారు. కూటమికి చెందిన కొంతమందిని ఉత్సవ కమిటీ సభ్యులను సిఫార్స్ చేస్తూ దేవదాయశాఖ అధికారులకు ఆయన లేఖ రాశారు. దీంతో ఆలయ ఈవో రాజగోపాలరెడ్డికి తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీని నియమిస్తూ ప్రభు త్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. ఈ ఆర్డర్ కాపీలు ఈవో కార్యాలయానికి అందాయి.

'పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారు'

డాబాగార్డెన్స్, జూలై 5: తన కుమారుడి విషయంలో న్యాయం చేయాల్సిన పోలీసులే అక్రమ కేసులు బనాయించడం దారుణమని బాధితురాలు, దళిత సేన నగర అధ్యక్షురాలు సత్యవాణి ఆరోపించారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మైనర్ అయిన తన కుమారుడిపై ఓ కేసులో తప్పుడు ఎఫ్‌ఐఆర్ వేసి చట్టాన్ని దుర్వినియోగం చేసిన ఎస్‌ఐ దివ్యభారతి, సీఐ ప్రసాదలపై విచారణ చేపట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో నెక్కలనాగమణి, మంగవేణి, ధనలక్ష్మి, అప్పారావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో సీవో, సచివాలయం సెక్రటరీలు

అక్కయ్యపాలెం, జూలై 5 : అతిసారం, ఇతర అంటు వ్యాధులనుంచి పిల్లలను రక్షించుకోవాలని 27వ వార్డు జీవీఎంసీ సీవో నిషాబేగం తల్లిదండ్రులను కోరారు. వార్డులోని దొండపర్తి పరిధి అమర్‌నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు వస్తున్నాయని, వాటి నుంచి దూరం కావాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో చెత్త, పనికిరాని వస్తువులను లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ గోపికృష్ణ, ఏఎన్‌ఎంలు సుశీల, శ్రీదేవి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

సీతంపేట, జూలై 5: ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయాన్ని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ టి. శ్రీనివాస, ప్రొఫెసర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ డి. హరినారాయణ శుక్రవారం సందర్శించారు. కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను చూపించారు. అనంతరం ప్రొఫెసర్ హరినారాయణ రుగ్వేదం 12 భాగాలు, యజుర్వే దం 3 భాగాలు, సామవేదం 2 భాగాలు, అధర్వణ వేదం 5భాగాలతో కలిగిన 22 పుస్తకాలు గలసెట్‌నుగ్రంథాలయానికివితరణగా అందించారు.

సమస్యలుంటే ఫోన్ చేయండి

» ఏఆర్ పోలీస్ సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చీ


సిబ్బంది నుంచి వందన స్వీకరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మహారాణిపేట, జూలై 5: పోలీసు కమిషనర్ శంఖ బ్రతబాగ్చీ శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో కవాతును పరిశీలించారు. ముందుగా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మైదానం లోపల గల సిబ్బంది టర్నౌట్‌లను నిశితంగాపరిశీ లించారు. ప్రతీ జిల్లాలో ఏఆర్ ఫోర్సు చాలా ప్రధానమని, సమస్య వచ్చినప్పుడు ఓ ఆయుధంలో పని చేస్తుందని సీపీ కొనియాడారు. అందరికీ అందుబాటులో ఉండేలా తాను ఫోన్: 79950 95799 నంబర్ అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. పోలీసు సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు ఏ అవసరమున్నా తనను సంప్రదించవచ్చునన్నారు. అవసరమైన సమయంలో సెలవు ఇవ్వకున్నా, రావాలిసన బకాయిలు పెండింగ్‌లో ఉన్నా, ఇతరేతర ఎవరైనా ఇబ్బంది పెట్టినా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు. మీరంతా ఆనందంతో ఉంటూ, విధుల్లో పాల్గొంటే తనకు సంతృప్తి ఉంటుందని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన అవసరం

» న్యాయమూర్తి వెంకట శేషమ్మ



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

కంచరపాలెం, జూలై 5 : విద్యార్థులు, యువత సైబర్ నేరాలు,ట్రాఫిక్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ విశాఖపట్నం సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ కోరారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్ చట్టాలు, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకట శేషమ్మ హాజరై విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. మైనర్లు వాహనాలను నడపరాదని,ట్రాఫిక్ నియమాలు పక్కాగా పాటించాలని కోరారు. హెల్మెట్ ధారణ అత్యంత ముఖ్యమన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు అమలు శిక్షలు, చట్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంచరపాలెం సీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జామి దివ్యభారతి, అధ్యాపకులు డా.బి.వి. లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాక్షి కవితల సంపుటి ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, సాహితీవేత్తలు

సీతంపేట, జూలై 5: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, ఆకాశవాణి పూర్వ అధికారి రొక్కం కామేశ్వరరావు రచించిన శతాక్షి కవితల సంపుటి మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కవితా సంపుటి వర్తమాన కాలానికి తగిన రీతిలో ఉందన్నారు. యువతరానికి కవిత్వం రాయాలనే స్ఫూర్తి నిస్తుందని పేర్కొన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కేజీ వేణు పుస్తకాన్ని సమీక్షించారు. బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీవీ సూర్యారావు, అరసం ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, కార్యదర్శులు పి.శ్యామ్ సుందర్, డాక్టర్ సి. ఎస్. క్షేత్రపాలరెడ్డి, ఇతర సభ్యులు కవి కామేశ్వరరావుని సత్కరించారు. ఈ కార్యక్రమలో డాక్టర్ డి.ఆర్.కె. రావు, బొట్ట అప్పారావు, పల్లా జగదీశ్వరరావు, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి, ఆచార్య వెలమల సిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలలు యాచన వృత్తి చేపట్టకుండా చూడాలి


సీపీని కలిసిన బాలల హక్కుల పరిరక్షణ సభ్యుడు సీతారాం తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 5: విశాఖ నగరంలో బాలలు యాచన వృత్తిలో కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. శుక్రవారం సీపీని కలిసి నగరంలో బాల ల సమస్యలపై మాట్లాడారు. వి విధ కూడళ్లలో చిన్నారులు యాచన చేస్తూ కనిపిస్తున్నారని పేర్కొన్నారన్నారు. వివిధ పాఠశాలల వద్ద ఆకతాయిలు విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బాలల హక్కులు, వారి పరిరక్షణకు పూర్తి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. నగరంలో యాచకులుగా తిరుగుతున్న బాలలను తమ యంత్రాంగం ద్వారా పూర్తి సమాచారం సేకరిస్తామన్నారు. అనం తరం వారిని ఆ వృత్తినుంచిదూరం చేసేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొబెషనరీ అధికారి శరత్‌కుమార్, నగర కన్వీనర్ కె. ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర రేపు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిదులు

మహారాణిపేట, జూలై 5: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీన జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నట్టు ఇస్కాన్ సంస్థ నగర అధ్యక్షుడు సాంబదాస తెలిపారు. నగరంలో ఒక హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను తెలిపారు. గత 16 సంవత్సరాలుగా నగరంలో దిగ్విజయంగా పూరిలోని జగన్నాథస్వామి తరహాలోనే స్వామివారి రథయా త్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 7 వతేదీ సాయంత్రం 4 గంటలకు సాగరతీరంలో ఉడాపార్కు నుంచి వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణ మిషన్ మీదుగా గురజాడ కళా క్షేత్రం వరకు ఈ రథయాత్ర కొనసాగుతుందన్నారు. స్వామి వారికి 1008 రకాల వంటకాలను మహా ప్రసాదంగా సమర్పిస్తామన్నారు. స్వామి వారికి హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తామని వివరించారు. ఈ రథయాత్రలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రి కె . రామోహన్‌నాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మాతాజీ నితాయినీ సేవిని, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి'


మంత్రి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సంఘ నాయకులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి కోరారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. గ్రామీణ వైద్యులకు గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గెద్ద చిరంజీవి, మమ్ముల తిరుపతిరావు, కర్రి సత్యనారాయణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లోనే మంచినీటి పైప్‌లైన్లు

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నీటి కాలుష్యానికి ప్రధాన కారణమైన డ్రైనేజీల్లోని పైప్‌లైన్‌లను సురక్షిత ప్రాంతానికి మార్చడాన్ని మాత్రం విస్మరిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో సుమారు 3.2 లక్షల కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇంటింటికీ సరఫరా కోసం ఏలేరు, తాటిపూడి, రైవాడ, మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నుంచి ప్రతిరోజూ 65 మిలియన్ గ్యాలన్ల నీటిని తీసుకువస్తున్నారు. ఆ నీటిని శుద్ధి చేసి, తగిన మోతాదులో క్లోరినేషన్ చేసిన తర్వాత 291 అంతర్గత మినీ రిజర్వాయర్ల ద్వారా నగరమంతటికీ సరఫరా చేస్తున్నారు. మినీ రిజర్వాయర్ల నుంచి ఇళ్లకు సరఫరా చేసేందుకు అంతర్గతంగా సుమారు మూడు వేల కిలోమీటర్లు పొడవున పైప్‌లైన్లు వేశారు. అయితే మహారాణిపేట, కంచరపాలెం, మల్కాపురం, గాజువాక, మద్దిలపాలెం, వన్‌టౌన్, అల్లిపురం, అక్కయ్యపాలెం, ముస్లింతాటిచెట్లపాలెం వంటి ప్రాంతాల్లో ఈ పైప్‌లైన్లు గెడ్డలు, డ్రైనేజీల గోడలకు అనుకునే ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తుంటాయి. అటువంటి సమయంలో కొళాయి పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరేందుకు ఆస్కారం ఉంటుంది. కొన్నిచోట్ల డ్రైనేజీల్లోనే కొళాయిల జాయింట్‌లు ఉండడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని నగరవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.అధికారులు అటువంటి పైప్‌లైన్ల మార్పుపై దృష్టిపెట్టకుండా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలతో హడావుడి చేస్తున్నారంటూ జీవీఎంసీ సిబ్బంది పెదవివిరుస్తున్నారు. ఈ విషయం నీటి సరఫరా విభాగం అధికారుల వద్ద ప్రస్తావించగా నీటి కాలుష్యానికి అవకాశమే లేదని కొట్టిపారేస్తున్నారు.

నాడు-నేడు పనులపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

అవరోధం కలిగింది. దీనికితోడు పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలకు పనులు అప్పగించడంతో ప్రధానోపాధ్యాయులతో అనేకచోట్ల ఇబ్బందులు తలెత్తాయి.

గడచిన రెండేళ్లలో రూ.114.48 కోట్లకుగాను రూ.48.73 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం, మరో రూ.43.65 కోట్ల విలువైన సిమెంట్, ఇసుక, ఇనుము, ఇతర మెటీరియల్ సరఫరా చేసింది. నిధులు, సిమెంట్ కొరతతో పలుచోట్ల భవనాలు శ్లాబ్‌ల వరకు వచ్చి ఆగిపోయాయి. మరికొన్నిచోట్ల నిధులున్నా సిమెంట్ కొరతతో పనులు సాగలేదు. రాష్ట్రంలో అతిపెద్ద పాఠశాల చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో నిధుల కొరతతో నాలుగైదు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి అధికారంలోకి రావడంతో నాడు-నేడు పనులపై తొలుత కొంత ఆందోళన వ్యక్తమైంది. అయితే నాడు-నేడు పనులపై మంత్రి లోకేశ్‌కు ఉన్నతాధికారులు వాస్తవాలు చెబుతూ నిధులు విడుదల చేస్తే వసతులు సమకూరతాయని వివరించారు. ఈ నేపథ్యంలో నాడు-నేడు పేరు మార్పునకు ఆదేశించిన లోకేశ్ రెండు, మూడు వారాల్లో నిధుల విడుదలపై ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'నాడు-నేడు' పథకం పేరును 'పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపు'గా మార్పుచేయనున్నట్టు తెలిసింది.

విశాఖ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేందుకు రూ.16 కోట్లు అవసరమని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఇంకా కొన్ని పాఠశాలలకు సిమెంట్ సరఫరా చేయాలని లేకపోతే స్థానికంగా కొనుగోలుకు అనుమతిస్తే సరిపోతుందని చెబుతున్నారు.

ఏయూలో ఎయిడెడ్ రచ్చ

... 5వ పేజీ తరువాయి

వెనక్కి పంపించేయాలంటూ కోరారు. హైకోర్టు స్టే విధించింది. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలు ఎయిడెడ్ ఫ్యాకల్టీని తీసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. ఏయూ అధికారులు మాత్రం 113 మందిని తీసుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, కోర్టులో ఉండడంతో భయపడి 92 మంది మాత్రమే వచ్చి చేరారు. ఈ విషయాన్ని అర్జునుడు మరోసారి కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా, కాలేజియేట్ కమిషనర్‌ను పిలిచింది. దీంతో వెనక్కి వచ్చేయాలంటూ అప్పటి కాలేజియేట్ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడంతో ఏయూలో చేరిన 50 మంది ఎయిడెడ్ ఫ్యాకల్టీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు వెళ్లిపోయారు. ఆ తరువాత నుంచి ఈ కేసు వాయిదాలు పడుతూ వస్తోంది. ఇప్పటికీ 39 మంది వర్సిటీలోనే కొనసాగుతున్నారు. వీరికి మొదట డిగ్రీ కాలేజీల నుంచి జీతాలు చెల్లించగా, ఆ తరువాత నుంచి వర్సిటీ నిధులు నుంచి చెల్లిస్తున్నారు. వీరంతా వర్సిటీలోని హిస్టరీ, పాలిటిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిని వర్సిటీలో చేర్చుకోవడమే నిబంధనలకు విరుద్ధమైతే కొందరికి హెచ్‌వోడీలుగా, డీన్లుగాను అధికారులు అప్పటి వర్సిటీ అధికారులు బాధ్యతలను అప్పగించారు. వీరంతా ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా వర్సిటీలో కొనసాగుతున్నారు.

యూజీసీ నిబంధనలకు విరుద్ధం

అసోసియేట్ ప్రొఫెసర్ కావాలంటే 12 ఏళ్లపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడంతోపాటు యూజీసీ కేర్ జర్నల్స్‌లో పబ్లికేషన్స్ ఉండాలి. అదేవిధంగా ఐదుగురు పీహెచ్‌డీ విద్యార్థులను తప్పనిసరిగా గైడ్ చేసి ఉండాలి. ఈ నిబంధనలను పాటించకుండానే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా తీసుకున్నారని చెబుతున్నారు.

ఎయిడెడ్ ఫ్యాకల్టీ వాదన ఇదీ

ఎయిడెడ్ ఫ్యాకల్టీ మాత్రం భిన్నమైన వాదనను వినిపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము డిగ్రీ కాలేజీల్లో చేరామని, ఉన్నత విద్యాశాఖ అధికారులు వర్సిటీల్లో చేరే ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలంటూ నోటిఫికేషన్ ఇచ్చారని, ఆ విధంగా తాము వచ్చామని చెబుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడే ఉంటామన్నారు. ఎయిడెడ్ కాలేజీలను అర్థాంతరంగా మూసేయడం వల్ల ప్రశాంతంగా సాగిపోతున్న తమ జీవితాలు రోడ్డునపడ్డాయన్న భావనను వారు వ్యక్తం చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర

... 5వ పేజీ తరువాయి

నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అంతవరకు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచకుండా ప్రస్తుతం అక్కడే జాయింట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి.రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించింది. పురపాలక శాఖకు చెందిన రవీంద్ర గత మూడేళ్లుగా వీఎంఆర్‌డీఏలో జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రాజెక్ట్స్, అకౌంట్స్ విభాగాల బాధ్యతలను నిర్వహించారు. కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ ప్రాజెక్టు నిర్వహణదారు నుంచి రూ.2 కోట్లకు పైగా బకాయి రావలసి ఉంటే దానిని కోర్టు ద్వారా స్వాధీనం చేసుకొని వీఎంఆర్‌డీఏ ద్వారానే నిర్వహిస్తున్నారు. దీనివల్ల గత ఆరు నెలలలోనే రూ.2 కోట్ల ఆదాయం సంస్థకు సమకూరడం గమనార్హం.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

ఉచిత సర్వీసులేనని గుర్తుచేశారు.

త్వరలో స్మార్ట్ మీటర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. మొత్తం పది లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. తొలి దశలో 3 వేల ఫీడర్లు, 1.3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఆ తరువాత 1.4 లక్షల ప్రభుత్వ సర్వీసులు, ఆపై వాణిజ్య, పరిశ్రమలకు ఈ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి ఇస్తామన్నారు. తక్కువ విద్యుత్ వాడేవారికి, ఉచిత విద్యుత్ తీసుకునేవారికి ఈ మీటర్ల అవసరం ఉండదన్నారు. ఇవి ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయన్నారు. వీటిని అమర్చిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ కోతలు విధించకూడదని, డిస్‌కనెక్ట్ చేయకూడదని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ సమయాన్ని 'హ్యాపీ అవర్స్'గా ప్రకటించిందన్నారు.

జగన్నాథ రథయాత్ర రేపు

ఎంవీపీ కాలనీ, జూలై 5 : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి యదురాజా దాస ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం కళాశాల నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంవీపీ డబుల్ రోడ్డు, ఇసుకతోట, వెంకోజీపాలెం, గోఠి సన్స్, సమతా కళాశాల, అప్పుఘర్ మీదుగా తిరిగి ప్రారంభ స్థలం వద్దకు చేరుతుందన్నారు. అనంతరం ఐఐఏఎం ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 5 : వరాహలక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో, ఆభరణాలతో అలంకరించి ప్రత్యేకవేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కొత్తగా 268 మంది విద్యార్థుల చేరిక

ఆరిలోవ, జూలై 5 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఈఏడాది 269 మంది విద్యార్థులు చేరినట్టు పాఠశాల హెచ్ఎం దుర్గా భవానీ తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఈనెలాఖరు నాటికి మొత్తం 300 మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

తగరపువలస, జూలై 5 : సీజనల్ వ్యాధుల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్ అన్నారు. శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తగరపువలసలోని ఓ ఫంక్షన్ హాలులో సీజనల్ వ్యాధులపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో వాడుక నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యత మహిళలదేనని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం సుగుణ, ఆశా కార్యకర్త సంతోషి, అంగన్వాడీ కార్యకర్త వెంకట రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి కోరారు. శుక్రవారం పెదవాల్తేరు, కాగితాల వీధి, పత్తివారి వీధి, కంద్రపు వీధుల్లో డ్వాక్రా మహిళలు సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

వెంకోజీపాలెం, జూలై 5 : కొత్త వెంకోజీపాలెంలోని సద్గురు సాయినాథ్ ట్రస్టు సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లికి చెందిన శరగడం రాధాకృష్ణ సహాయంతో ఆలయంలో పనిచేస్తున్న బోర లక్ష్మి కుమారుడు యుగంధర్ పాఠశాల ఫీజు నిమిత్తం రూ. 15 వేలు అందజేశారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఈ చిన్నారికి చెక్కు ఇచ్చారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే వెలగపూడి



మెట్ల మార్గంలో ఎమ్మెల్యే వెలగపూడి దంపతులు

ఎంవీపీ కాలనీ, జూలై 5 : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు వెళ్లిన ఆయన మెట్ల మార్గం గుండా వెళుతూ, ప్రతి మెట్టుపై హారతి వెలిగించి, తన భక్తిని చాటుకున్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడీ, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 38,టమాటా 38, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 27, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 32, క్యారెట్ 30, దొండకాయలు 27, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 30, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఇష్టారాజ్యంగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు

- కొన్నిచోట్ల ఎత్తు పల్లాలు
- మరికొన్నిచోట్ల లింక్ రోడ్లు, కాలువలు మాయం
- రాకపోకలకు అడివివరం గ్రామస్థుల ఇబ్బందులు



గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న లింక్ రోడ్డు

సింహాచలం, జూలై 5 : జీవీఎంసీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సింహాచలం కారిడార్‌లో జరుగుతున్న పనుల వల్ల అడివివరం గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పాత గోశాల కూడలి నుంచి తొలిపావంచా వరకు మొదటి దశలో నిర్మాణం జరుగుతోంది. తొలిపావంచా నుంచి పాతఅడివివరం కూడలి వరకు ఉన్న రోడ్డు నిర్మాణం వల్ల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోడ్డును ఆనుకుని ఉన్న అనేక అనుసంధాన రోడ్ల నిర్మాణంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి ఇరువైపులా మెయిన్ రోడ్డులో కర్రి అప్పలస్వామి కల్యాణ మండపం పక్కన ఉన్న పోస్టాఫీసు వీధి, కుమ్మరివీధి కూడలి మీదుగా పోస్టాఫీసు వీధి, మధ్య వీధి, రామాలయం వీధి, గాంధీనగర్‌కు వెళ్లేందుకు ముఖ్యమైన అనుసంధాన రోడ్డు, కాపు వీధిలో రోడ్డును ఎడమ వైపు లోతుగా, కుడివైపు ఎత్తుగా నిర్మించారు. దీంతో ఇళ్లు ఎత్తులో ఉన్నాయి. అలాగే లింక్ రోడ్లు కొన్నిచోట్ల వేయలేదు, మరికొన్ని చోట్ల రాకపోకలకు అనుకూలంగా లేవు. గత ఏడాది నుంచి నేటి వరకు కారిడార్‌ను ఆనుకుని ఉన్న ప్రజలు ఇళ్లకు చేరుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల అయితే వాహనాలు తీసుకువెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఉంది. ఈనేపథ్యంలో అప్పన్న తిరువీధులు, గ్రామ దేవతల పండగల వేళ ఊరేగింపుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

లింక్ రోడ్లు లేకపోవడంతో కనీసం అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చేందుకు కూడా దారి కనిపించడం లేదు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ సంయుక్తంగా ఈ మార్గంలో పర్యటించి ప్రజల అవస్థలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఇరుకు రోడ్లలోకి భారీ వాహనాలు



శివాలయం వీధి రోడ్డులోకి లోడ్‌తో వచ్చిన లారీ

మద్దిలపాలెం, జూలై 5 : మద్దిలపాలెంలోని ఇరుకు రోడ్లలోకి భారీ వాహనాలు ప్రవేశిస్తున్నాయి. పెద్ద పెద్ద లోడ్లతో అవి రావడంతో స్థానికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇక్కడ చిన్న చిన్న సందుల్లో కూడా పలు సంస్థలు టైల్స్ గొడౌన్లు ఏర్పాటు చేశాయి. ఆయా గొడౌన్లకు సరకు తీసుకొచ్చే లారీలు ఇరుకు రోడ్లలోకి వస్తున్నాయి. సమయపాలన లేకుండా లారీలు తిరగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన లారీలు రిటర్న్ చేయడానికి డ్రైవర్లు అష్టకష్టాలు పడుతున్నారు. లారీ అన్ లోడింగ్ చేసి, వెనక్కి వెళ్లడానికి గంట సమయం పడుతుంది. అప్పటివరకు ఆ రహదారుల్లో వెళ్లే వాహనదారులు వేచి చూడాల్సి వస్తోంది. వాస్తవానికి వీధుల్లో ప్రయాణికులకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ బ్లూకోట్స్ సిబ్బంది నిత్యం తిరుగుతుంటారు. ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ బ్లూకోట్స్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారు. నిబంధనలు ప్రకారం భారీ వాహనాలకు జాతీయ రహదారిపై తప్పితే ఇరుకు రోడ్లలోకి వెళ్లడానికి అనుమతి లేదు. కానీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకున్నపాపాన పోవడం లేదు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, జూలై 5 : మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లోని శాంతి భద్రతలు, క్రైం, ట్రాఫిక్ విభాగాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన శాంతి భద్రతల విభాగం రిసెప్షన్‌లో కూర్చొని ఫిర్యాదుదారుల పట్ల పోలీసుల ప్రవర్తనను పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులను కూర్చొపెట్టి వారి సమస్య తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి సమస్య ఉన్నా.. 7995095799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం ట్రాఫిక్ విభాగాన్ని తనిఖీ చేసి పోలీసులకు పలు సూచనలు చేశారు. రద్దీగా ఉన్న ప్రాంతాలపై దృష్టిసారించాలన్నారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే రౌడీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణం తొలగింపు

భీమునిపట్నం, జూలై 5 : కాపులుప్పాడ రెవెన్యూ పరిధిలోని మంగమారిపేటలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. కాపులుప్పాడ సర్వే నంబరు 314లో తొట్లకొండ ఏటవాలు ప్రదేశంలో వీబీసీ కాలనీకి సమీపంలో ఈ నిర్మాణం జరుగుతోంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు కాపులుప్పాడ వీఆర్వో గుర్ల అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటి నిర్మాణానికి సంబంధించిన ప్రహరీని, ఐరన్ పిల్లర్లను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని తహసీల్దార్ గోవింద్ హెచ్చరించారు.

క్రమశిక్షణ అవసరం : ఎంఈఓ



పాఠశాలల నిర్వహణపై వివరిస్తున్న ఎంఈవో జయప్రద

భీమునిపట్నం, జూలై 5 : విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఉండాలని ఎంఈఓ-2 జయప్రద అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని పాఠశాలల ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులంతా విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, స్టూడెంట్ కిట్లు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో శివరాణి మాట్లాడుతూ విద్యార్థులందరికీ బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాలు బోధించి ప్రతినెలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, పాఠశాలకు సంబంధించిన అంశాలను వారితో చర్చించాలన్నారు. అనంతరం హైదరాబాద్ నిజామ్ ఇనిస్టిట్యూషన్‌కు చెందిన రమేష్ మహేష్ ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మురళీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

భీమునిపట్నం, జూలై 5 : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుంది. శిబిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే ఈశిబిరాన్ని రోగులు సద్వి నియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఆర్థోపెడిక్ వైద్యంపై ఆర్ఎంపీలకు శిక్షణ

పద్మనాభం, జూలై 5 : పద్మనాభంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కాస్వీ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు ఆర్థోపెడిక్ వైద్య విధానాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేత డాక్టర్ మోపాడ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సత్వరమే చేపట్టాల్సిన ప్రథమ చికిత్సా విధానాలను వివరించారు. ఎముకలకు సంబంధించి వచ్చే వ్యాధుల నివారణ మార్గాలను తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనుభవజ్ఞులయిన వైద్యుల వద్దకు వారిని పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు, కార్యదర్శి ఎంవీ రమణ, సభ్యులు తాతబాబు, రామారావు, ప్రసాద్, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజరు అభిషేక్, పీఆర్వో కోటి, గోవింద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసి 45 వసంతాలు పూర్తి కావడంతో ఆ సంస్థ అధికారులు శుక్రవారం అనాథలు, వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఆరిలోవలో చిన్నపిల్లలు, వృద్ధులు ఉండే అనాథ ఆశ్రమం, నగరంలో మరో వృద్ధాశ్రమానికి వెళ్లి నెల రోజులకు సరిపడ నిత్యావసర సరకులు, కూరగాయలు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి. అఖిల, ఈఈ జి. సత్యనారాయణ, ఇతర అధికారులు సీతారామ్, రామకృష్ణ, సూర్యప్రకాష్, సూర్యారావు, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో వెలగని వీధి లైట్లు

సాగర్‌నగర్, జూలై 5 : సాగర్‌నగర్ కాలనీలో కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడం, గంజాయి బ్యాచ్‌లు తిరుగుతుండడంతో రాత్రి 8 గంటల తరువాత వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి లైట్లు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న అర్చకులు

సాగర్‌నగర్, జూలై 5 : రుషికొండలో శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాలతో పట్టు వస్త్రాలు తీసుకువెళ్లి స్వామివారికి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ అధ్యాపకుల్ని వెనక్కి పంపించాలని ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూలై 5 : ఏయూలో డిప్యూటేషన్‌పై చేరిన 113 మంది ఎయిడెడ్ అధ్యాపకులను తక్షణమే వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు ఫిజిక్స్ విభాగం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కృష్ణా కళాశాల నుంచి వచ్చిన ఇద్దరు అసిస్టెంటు ప్రొఫెసర్లు, నోటిఫికేషన్ లేకుండా వచ్చిన అడ్జంట్ ప్రొఫెసర్, ప్రాక్టీస్ ఇన్ ప్రొఫెసర్లను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయూలో తరగతులు ప్రారంభం కావడంతో తక్షణమే వీసీ నియామకం చేపట్టాలన్నారు. లేకపోతే పాలన గాడి తప్పుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, డాక్టర్ సూరి, డాక్టర్ భాను, తదితరులు పాల్గొన్నారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఆరిలోవ, జూలై 5 : జునోసిస్ వ్యాధులపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని ఆంధ్రా మెడికల్ కళాశాల అదనపు ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఆయన జూపార్కులో యానిమల్ కీపర్లకు జునోసిస్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ వ్యాధులు ఎక్కువగా జంతువుల నుంచి సోకుతాయని, జూలో పని చేసే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తునిపాలెంలో పనిచేయని మంచినీటి పథకం



పద్మనాభం, జూలై 5 : మండలంలోని తునిపాలెం గ్రామంలో ఐదు రోజులుగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. మోటార్లు కాలిపోవడంతో అయిదు రోజులుగా ట్యాంకు నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యపై స్థానికులు అధికారులకు విన్నవించగా మూడు రోజుల క్రితం నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా.. ఫలితం లేదన్నారు. గ్రామంలో ఉన్న చేతి బోర్లు కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో తాగునీటి ఇక్కట్లు అధికమయ్యాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటరావును వివరణ కోరగా రెండు మోటార్లు కాలిపోయాయని, కొత్త మోటార్లు తీసుకువచ్చామని చెప్పారు. రెండు రోజుల్లో బిగిస్తామన్నారు.



ప్రధాన కాలువను పరిశీలిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

ఇలా ఉంటే వ్యాధులు రావా.. : ఏడీసీ

ఆరిలోవ. జూలై 5 : గ్రేటర్ పరిధిలోని 13వ వార్డులో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ శుక్రవారం ఉదయం పర్యటించారు. జీవీఎంసీ సిబ్బంది కొన్నిచోట్ల గెడ్డలు, కాలువల్లో పూడికతీత సరిగ్గా చేపట్టకపోవడంతో సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన కాలువలు తుప్పలు, వ్యర్థాలతో ఉండడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదని, తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. కాగా 13వ వార్డు కార్పొరేటర్ భర్త కెల్ల సత్యన్నారాయణ మార్కెట్ యార్డు నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయాన్ని ఏడీసీ దృష్టికి తీసుకువచ్చారు. దుకాణ సముదాయంలో పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. దీనిపై ఏడీసీ సానుకూలంగా స్పందించారు.

కళావిహీనంగా స్వతంత్రనగర్ కాలనీ పార్కు



పార్కులో తుప్పు పట్టి పాడైన ఆట వస్తువులు

మధురవాడ, జూలై 5 : జీవీఎంసీ ఏడో వార్డులోని స్వతంత్రనగర్ కాలనీలో ఉన్న పార్కు నిర్వహణ లోపం వల్ల కళావిహీనంగా తయారైంది. కాలనీలో పదేళ్ల కిందట ఈ పార్కును ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఉన్నా.. కొన్ని పాడైపోయాయి. మరికొన్ని విరిగిపోయాయి. ఇక్కడ ఒక పచ్చ మొక్క కూడా లేదు. ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో పిల్లలను పార్కుకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు పచ్చదనం కోసం మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటికీ తాగునీటి సదుపాయం : కార్పొరేటర్



ఎస్సీ కాలనీలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ చిన్నికుమారి

తగరపువలస, జూలై 5 : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో ఉన్న 14 శివారు గ్రామాలకు ఇంటింటికి తాగునీరు అం దించనున్నట్టు వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి తెలిపారు. శుక్రవారం ఆమె వార్డులోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న మంచినీటి పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాలు కలుషితమై ఉప్పు నీరుగా మారిపోవడం వల్ల గోస్తనీ నది నుంచి గొట్టాల ద్వారా నీటిని రప్పించి ఇంటింటికి కొళాయిల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ పనులను గతంలో ప్రారంభించినప్పటికీ వైసీపీ పాలనలో నత్తనడకన సాగాయని, ప్రభుత్వం మారడంతో నిర్మాణం ఊపందుకుందన్నారు. ఈ కాలనీలో 50 ఇళ్లకు కొళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.అప్పారావు, వెంకటేష్, రాజేష్, సీహెచ్ అప్పలరెడ్డి, ఎర్రయ్యరెడ్డి, గోపి, చిన్నసత్యం, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ కృష్ణ కళాశాలకు వాటర్ ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జూలై 5 : డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌లను ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి శ్రావణ్‌కుమార్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు పద్మ తమ సొంత నిధులతో రెండు వాటర్ ప్లాంట్‌లు వితరణగా అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జి. రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసప్రసాద్, జి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు బస్సు సౌకర్యం లేక అవస్థలు

సాగర్‌నగర్, జూలై 5 : సాగర్‌నగర్ కాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఇక్కడికి మద్దిలపాలెం డిపో నుంచి ఐదు సర్వీసులు తిరిగేవి. ప్రస్తుతం మూడు సర్వీసులు మాత్రమే సాగర్‌నగర్ మీదుగా గొల్లల ఎండాడ వరకు తిరుగుతున్నాయి. ఈ సర్వీసులు కాలనీకి ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు వెళ్తాయో తెలియడం లేదు. ప్రస్తుతం 52వి/జి బస్సు సర్వీసును ఉదయం పూట ఒక్కసారి మాత్రమే రైల్వే స్టేషన్‌కు నడుపుతున్నారు. మిగతా సమయాల్లో రైల్వేస్టేషన్‌కు చేరేందుకు ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రైల్వేస్టేషన్ నుంచి బీచ్‌రోడ్డు మీదుగా భీమిలి వెళ్లే 900 కే/ఆర్ సర్వీసును సాగర్‌నగర్ కాలనీ నుంచి నడిపితే రైల్వేస్టేషన్‌కు చేరేందుకు సాగర్‌నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సౌలభ్యంగా వుంటుంది. ఆ దిశగా ఆర్టీసీ అధికారులు ఆలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

భీమునిపట్నం, జూలై 7 : పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జూబ్లీ ఉత్సవాలు నిర్వహించే విషయమై ఆదివారం పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించనున్నట్టు స్కూల్ హెచ్ఎం పొన్నగంటి రమణ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూబ్లీ ఉత్సవాలను ఏవిధంగా నిర్వహించాలి ? ఎవరెవరు ఎలా సహకరిస్తారు.. వంటి విషయాలను సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

నేడు ఉక్కు నగరం క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 5 : ఉక్కు నగరం క్లబ్ నూతన పాలక వర్గానికి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. కార్యదర్శి పదవికి ఇద్దరు, సహాయ కార్యదర్శి పదవికి ఇద్దరు, కోశాధికారి పదవికి ముగ్గురు చొప్పున పోటీ పడుతున్నారు. అదేవిధంగా కమిటీ సభ్యులకు కూడా పోటీ ఉంది. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.